# కొడుకుతో కూతురు

- దొగ్గా సాయిచంద్రశేఖర్

'సరస్వతీ! నిన్ను బ్రతికించుకుంటాను.. సరస్వతి! నిన్ను బ్రతికించుకుంటాను..'

''నాన్నా! ఎంత సేపయింది వచ్చి. ఏమిటి మీలో మీరే మాట్లాడుకుంటున్నారు'' అన్న కూతురి కంఠం విని వెంటాడుతున్న దృశ్యాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తూ, కూతురు ముఖాన్ని చూసాడు రాఘవయ్య.

వారం రోజుల నుండి అదే దృశ్యం కళ్ళు తెరిచినా, కళ్ళు మూసినా, వెంటాడుతుంది రాఘవయ్యను.

''వచ్చి చాలాసేపయిందమ్మా! మీ అత్తగారు పలకరించి వెళ్ళారు'' అన్నాడు రాఘవయ్య.

ముఖంలో అప్పటిదాకా కలిగిన భయం తాలూకా ఛాయల్ని గుర్తించి ''అదేమిటి నాన్నా! అలా ఉన్నారు?'' అంది.

మౌనంగా వుండిపోయాడు రాఘవయ్య.

''ఆరోగ్యం బాగాలేదా!'' సోఫాలో ఁడుచుకుని కూర్చున్న తండ్రిని మరింత పరీక్షగా చూస్తూ అడిగింది శ్రీకళ్యాణి.

''నా ఆరోగ్యం బాగానే ఉంది తల్లీ... అమ్మకే! బావోలేదు. హాస్పిటల్లో చేర్పించి వారం రోజులు పైగా అయింది.''

''ఫోన్ చెయ్యలేదు. కనీసం ఉత్తరం ముక్కయినా వ్రాయలేదు'' అందామె.

నవ్వి ఊరుకున్నాడు రాఘవయ్య.

ఉత్తరం వ్రాసాడు కానీ! జవాబులేదు. ఫోన్ చేసి, నేను రాఘవయ్యను అనగానే, ఫోన్ కట్.. పెట్టేసిన చప్పుడు. అందుకే నవ్వే సమాధానంగా ఇచ్చాడు.

అసలు రాకూడదనే అనుకున్నాడు. కానీ, తనతో నలభై సంవత్సరాలు సహజీవనం చేసిన అనేకంటే సహనంతో జీవితాంతం ఊడిగం చేసిన అంటే, బావుంటుందేమో!

అలాంటి భార్య శరీరం హాస్పిటల్లో బెడ్‌మీద ఆపరేషన్ కోసం ఎదురుచూస్తూ... ఉంటే

తప్పనిసరి పరిస్థితి తన్ను కూతురు దగ్గరకు తీసుకువచ్చింది. అసలు విషయం చెప్పాల్సిన సమయం ఆసన్నమయింది అన్నట్లు, పదాల చేరిక ఎలా ఉండాలో ఆలోచిస్తున్నంతలో-

''కాఫీ తెస్తాను'' అంటూ శ్రీకళ్యాణి కిచన్ రూమ్‌లోకి వెళ్ళింది.

కూతురు వెళ్ళినవైపే చూస్తున్నాడు రాఘవయ్య.

ఇప్పుడు తనకి కావలసింది అతిథి మర్యాదలు కాదు. ఆపద గట్టెక్కడానికి కావలసిన ఏకైక ఆయుధం 'డబ్బు'.

కూతురు వస్తుందేమో! తొందరగా విషయం బయటపెడదాం అని చూస్తున్నాడు.

కిచన్‌లో నుండి మాటలు వినబడుతున్నాయి.

''ఈమధ్య మీ అన్నయ్య, నాన్న కలసి చేసిన వ్యాపారం దెబ్బతిందని చెప్పుకుంటున్నారు. ఆయనగారు వచ్చింది డబ్బుకోసమే అయ్యుంటుంది. ఈవయస్సులో మీ నాన్న తిరిగి ఇచ్చే అవకాశం అస్సలు ఉండదు. ఆలోచించుకుమరీ. సమాధానం చెప్పు'' అంటుంది వియ్యపురాలు.

అలాంటి మాటలు నాకు వినబడకుండా ఉంటే బావుండు అన్పించింది. అయినా, కూతురు సమాధానం వినడానికి గుండెలు చిక్కబట్టుకుని కూర్చున్నాడు.

కాఫీ కప్పుతో, కూతురి బదులు వీపరాలు వచ్చింది.

''అమ్మాయి కూర పొయ్యిమీద వేస్తుంది అన్నయ్యగారూ!'' అంటూ కాఫీ అందించి అడిగింది. ''చెప్పండి, ఏపనిమీద వచ్చారు?'' అని.

కాఫీ కప్పు అందుకున్న రాఘవయ్య ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ''చెక్కర వెయ్యలేదు కదా!'' అని అడిగాడు.

''వెయ్యలేదులెండి. ఆమాత్రం తెలీదా. ఈరోజుల్లో 40 దాటిన వాళ్ళందరికీ చక్కెర వ్యాధేటగా'' అంది తెలివిగా.

కాఫీ త్రాగి కప్పు టీపాయ్‌మీద పెట్టి- ''అమ్మాయిని పిలిస్తే, ఒక్కమాట చెప్పి వెళతాను'' అన్నాడు.

''కళ్యాణీ'' పిలిచింది వీపరాలు.

కళ్యాణి చేతులు తుడుచుకుంటూ బయటకు వస్తూనే అంది ''నాన్నగారు, భోజనం రడీ చేస్తున్నాను. తిన్న తర్వాత మాట్లాడుకుందాం'' అని.

''భోజనం వద్దమ్మా. నీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి'' అన్నాడు.

''మీ విషయాలకి నేను అడ్డమనుకుంటా..'' అంటూ వియ్యపురాలు తిప్పుకుంటూ కిచన్‌లోకి వెళ్ళింది.

అప్పుడు నోరువిప్పాడు రాఘవయ్య.

''మీ అమ్మ పరిస్థితి ఏం బావోలేదు. అన్నయ్యకు వ్యాపారంలో నష్టం వచ్చింది. ఉన్న ఇల్లు కూడా అమ్మేసాం. ఇప్పుడు అమ్మకు ఆపరేషన్ చేయించడానికి లక్ష రూపాయలు కావాలి. లేకుంటే అమ్మ మనకి దక్కదు'' అని.. దాదాపు ఏడుస్తున్నట్టు రాఘవయ్య చెబుతుంటే-

శ్రీకళ్యాణి అంది ''ఆయన ఊరుకెళ్ళారు నాన్నా. రాగానే ఏ సంగతి అడిగి చెబుతాను'' అని.

3వ సంవత్సరం నడుస్తుండగా.. ఎ.సి. కార్లో బాసర వెళ్ళి సరస్వతిదేవి ఆలయంలో అక్షరాభ్యాసం చేయించాడు కూతురు శ్రీకళ్యాణికి.

చక్కగా మాటలు నేర్చిన కూతురు సమాధానం విన్న రాఘవయ్య మనసులో కట్టుకున్న చిన్నారి గూడు చెదిరిపోయింది.

'ఆడదానికి కూడా సమానమైన హక్కు కల్పించాలి' అన్న తండ్రి తను.

కొడుకుకంటే ఎక్కువగా కూతుర్ని చదివించాడు. ఆస్థిని కూడా ఆమెకే కట్టబెట్టాడు.

సమానమైన హక్కు అంటే, 'కేవలం ఆస్తిలోనేనని, సహాయ సహకారాలలో కాదని' తనకిప్పుడు అర్థమైంది.

''అమ్మా, కళ్యాణీ'' అన్నాడు.

''ఏమిటి నాన్నా?''

''మీ అమ్మని బ్రతికించవా.. తల్లీ!'' అన్నాడు.

మౌనం..

''వెళుతున్నానమ్మా'' అని వీధి గుమ్మంవైపు నడిచాడు రాఘవయ్య.

• • •

భార్యను బ్రతికించుకోవడం కోసం, కూతురు దగ్గరకు వెళ్ళి.. ఓడిపోయి వచ్చాడు.

కూతురు ఆలోచనల నుండి ఇంకా బయటపడలేదు. మరింత వెనక్కి వెళ్ళాయి అతని ఆలోచనలు.

నాన్నా! అంటూ, పెళ్ళయిన ఆరు నెలలకే కోరికలతో గుమ్మంలో అడుగుపెట్టిన శ్రీకళ్యాణి గుర్తుకు వచ్చింది.

కూతురు కోరిక తీర్చడానికి ఆరోజు దంపతులిద్దరూ ఎంత ముచ్చట పడ్డారో, కనుల ముందు కదలాడింది.

''అయినా, అది ఏమంత కష్టం నాన్నా. చెల్లాయి అడుగుతుంది. కాదనకండి'' అన్న కొడుకు మాటలు, అన్నయ్య సపోర్ట్ చూసి కాస్తంత గర్వం



కదలాడిన కళ్యాణి ముఖం గుర్తుకొచ్చాయి.

''మీ ఆయన్ని అడిగే వచ్చావా?!'' అన్నాడప్పుడు రాఘవయ్య.

''ఇందులో ఆయన ఇష్టం ఏముంది నాన్నా. నా ఇష్టమే వారి ఇష్టం'' అంది కళ్యాణి కాస్త గర్వంగా.

''అయినా మీ అత్తవారిల్లు మీ సొంతమే కదమ్మా. నీకు మరో ఇల్లెందుకు?'' అన్నాడు రాఘవయ్య.

''కావాలి నాన్నా. ఎప్పుడైనా అత్తయ్యమీద అలిగితే ఎక్కడికి వెళ్ళిపోతాం?'' అంది కళ్యాణి.

సరిగ్గా, వారం తిరగకముందే, అపార్టుమెంటు కొని కూతురి పేర్న రిజిస్టర్ చేయించి, దంపతులిద్దరూ స్వయంగా అప్పగించి వచ్చారు డాక్యుమెంట్స్.

కొన్ని సంవత్సరాల తరువాత శ్రీకళ్యాణి కొడుకుని తీసుకు వచ్చింది తాతయ్య దగ్గరకు.

''తాతయ్యగారూ'' అనే వాడి ముద్దు ముద్దు మాటలకు కరిగిపోయిన రాఘవయ్య ''నీకేం కావాలిరా'' అని అడిగాడు.

వాడు చెప్పలేదు కానీ, కళ్యాణే చెప్పింది-

''నాన్నా! బాబుని రిషివ్యాలీ స్కూల్లో చేర్పించాలని ఉంది. నెల ఫీజులైతే కడతాంగానీ, లక్షలకు లక్షలు డొనేషన్లు కట్టడం నావల్ల కాదన్నారాయన. నాకైతే వాణ్ణి అక్కడే చదివించాలని ఉంది.''

కూతురి మాటలకు అడ్డొస్తూ, ''ఇప్పుడేం చెయ్యమంటావో చెప్పవే'' అంది సరస్వతమ్మ.

''డొనేషన్ నాన్నని కట్టమను'' అంది కళ్యాణి.

''అదేదో డొనేషన్ అట కట్టండి'' ఆర్డర్ వేసింది సరస్వతమ్మ.

చిరునవ్వుతో అడిగాడు రాఘవయ్య, ''మీ ఆయన్ని అడిగావా అమ్మా'' అని.

''ఇందులో ఆయన ఇష్టం ఏముంది నాన్నా!'' అంది.

మరుసటిరోజే డి.డి. తీసి రిషివ్యాలి స్కూల్‌కి పంపించాడు మనవడి సీటు రిజర్వు చేయడంకోసం.

ఇదేవిధంగా రెండో మనవడికి కూడా లక్షల్లో డొనేషన్ కట్టాడు రాఘవయ్య.

కూతురు ముఖంలో ఆనందం చూడటానికి ఎప్పుడు అడిగితే అప్పుడు లక్షలు ఖర్చుచేసాడు.

ఈరోజు ఆ ముద్దుల కూతురు తండ్రి ముఖంలోని తల్లి గురించిన ఆందోళనని గమనించలేదు.

బోసి నవ్వులు నవ్వుతూ, చిన్నారి కళ్యాణి పాదాలతో గుండెలమీద తన్నినపుడు ఆనందపడ్డాడు. ఆ చిన్నారే, పెరిగి పెద్దదై చెప్పిన ఒక్క సమాధానానికి ఆ గుండె తూట్లుపడుతుందని ఊహించలేదు రాఘవయ్య.


సర్వం కోల్పోయి కేవలం ఒక లక్షరూపాయల కోసం కూతురు దగ్గరకు దేహీ అని వెళితే, ''ఆయన గార్ని అడగాలి'' అంది.

రాఘవయ్య కూతురి మీద ఉన్న ప్రేమ కాస్తా ఆవిరి అవకముందే ఆ ఇంటినుండి బయటపడ్డాడు.

• • •


హాస్పిటల్ బెడ్‌మీద కన్ను తెరవకుండా పడివున్న భార్యను ఇంట్లో మునగతీసుకుని కూర్చున్న కొడు

# శ్రీరాంని మెచ్చిన మెగాస్టార్



'కొన్ని ఏళ్ళ గ్యాప్ తర్వాత 'చాలాబాగుంది' చిత్రంలో ఇ.వి.వి.గారు తనకి అవకాశం ఇచ్చారని' చెప్తున్న ఎల్.బి.శ్రీరాం గొప్పనటుడు. అయినా అవకాశాలు రావొద్దూ! మన మెగాస్టార్ చిరంజీవిగారు ఆ చిత్రం చూసి అందులో ఎల్.బి.శ్రీరాం నటనని చూసి చాలా మెచ్చుకున్నారట. డైలాగ్స్‌ని అలా పట్టిపట్టి చెప్పి, డిఫరెంట్‌స్టైల్‌లో మాట్లాడి అందరినీ కడుపుబ్బ నవ్వించిన శ్రీరాంని కంగ్రాట్స్ చేశారట. అంతేకాదు, 'సినిమా ఇండస్ట్రీ ఎవరికి, ఏరూపంలో అన్నం పెడుతుందోకదా శ్రీరాం' అని అన్నారట. నిజమే! ఎంతోమంది టాలెంటెడ్ ఆర్టిస్టులు అవకాశాలు లేకుండా ఎదురుచూస్తున్నారు. అవకాశం వచ్చినపుడే మన టాలెంట్ నిరూపించుకోవడం తెలివైనవాళ్ళ లక్షణం. శ్రీరాంగార్కి మరిన్ని అవకాశాలు వస్తాయనడంలో ఏమాత్రం డౌట్‌లేదు.

**- విరాజి**




కును ఆదుకోవడానికి ఏదేవుడైనా దిగివస్తాడేమోనని ఎదురుచూస్తున్నాడు రాఘవయ్య.

ఇంకో అవకాశం ఏదైనా ఉందేమోనని ఆశతో ఆలోచన సాగించాడు. అల్లుణ్ణే స్వయంగా అడుగుదాం అనుకున్నాడు. ఛ.. అన్పించింది. పోనీ, కోడల్ని-

అసలు కోడలుకి తానేం చూసాడు గనక- అడగడానికి అర్హత కూడా ఉండాలి. అయినా, మనసు ఊరుకోలేదు.

కోడలు జ్యోతి ఊరువెళ్ళి నాల్గురోజులైంది-

అత్తయ్య పరిస్థితి, భర్త పరిస్థితి ఇలాఉండగా ఆ అమ్మాయి పుట్టింటికి ఎందుకు వెళ్ళిందో అర్థంకాలేదాయనకి.

ఫోన్ చేద్దాం అని హాస్పిటల్ బయటకు నడిచాడు.

హాస్పిటల్ ఆవరణలోనే ఉన్న ఎస్.టి.డి. బూత్‌లో ప్రవేశించి డైల్ చేసాడు.

''హలో! ఆనందరావుగారా, నమస్కారం... నేను, రాఘవయ్యని..''

అవతల్నుండి నమస్కారాలు అయిన తరువాత ఆనందరావు అడిగాడు ''ఎక్కడి నుండి?'' అని.

''సరస్వతిని హాస్పిటల్ చేర్చాం... అక్కడి నుండి'' చెప్పాడు.

''నేనూ బయలుదేరేవాణ్ణి. కోతలు అయిన తర్వాత వద్దాం అని ఆగాను.''

''సరే, అమ్మాయిని పిలువ్.''

అమ్మా జ్యోతి మీ మామగారు అన్న ఆనందరావు కంఠం విన్పించిన క్షణంలోనే కోడలి కంఠం వినిపించింది.

''ఏమిటి మామయ్యా! అత్తయ్యగార్కి ఎలా వుంది? ఆయన ఎలావున్నారు? ఈరోజే బయలుదేరుదాం అనుకుంటున్నాను..''

''అమ్మ..'' అని ఏదో చెప్పబోతుంటే-

''నేను వచ్చేస్తాను మామయ్యా. కంగారుపడకండి'' అన్న కోడలి కంఠంలోని మాధుర్యంతో కాస్త స్థిమ్మితపడ్డాడు. కోడలుపిల్లకు అన్నీ తెలుసు. ఏదో ఒకటి చేస్తుంది అన్న నమ్మకం కలిగింది.

• • •

జ్యోతి ఊరునుండి రావడం హాస్పిటల్‌లో డబ్బు కట్టడం, ఆపరేషన్ జరిగిపోవడం, సరస్వతమ్మ తిరిగి ఆరోగ్యంతో ఇంట్లోకి అడుగుపెట్టడం వెంట వెంటనే జరిగిపోయాయి.

రాఘవయ్య కొడుకుతో కలిసి తిరిగి వ్యాపారం ప్రారంభించడం- కొద్ది సంవత్సరాల్లో అది ఉన్నత స్థితికి చేరుకోవడం కూడా జరిగిపోయింది.

• • •

అసలు కోడలు డబ్బు ఎలా తెచ్చింది అని అప్పటి వరకూ అడగని రాఘవయ్య, అప్పు తీర్చే పొజిషన్ రాగానే, ఆమెని పిలిచి అడిగాడు, ''ఆరోజు డబ్బు ఎక్కడనుండి తెచ్చావ్? అని అడగకుండా. అవసరాలు గడుపుకున్నాం. అటు ఆపరేషన్‌కి, ఇటు వ్యాపారానికి అంత డబ్బు ఎలా సర్దగలిగావమ్మా'' అని.

''నాన్నగారు నాకు పసుపుకుంకం క్రింద రెండు ఎకరాల తోట ఇస్తానన్నారు. అప్పుడు మీరు వద్దు అన్నారు గుర్తుందా మామయ్యా... నాన్న అప్పుచేసి డబ్బు సర్దారు...''

కోడలు చెబుతుంటే వెంటనే ఆ సన్నివేశం గుర్తొచ్చింది.

''ముష్టితోట ఎవరికి కావాలిట. క్యాష్ ఇమ్మను'' అన్నాడు రాఘవయ్య. ఆరోజు వియ్యంకుడు పంపించిన డబ్బు కూడా కూతురుకే ఖర్చు చేసాడు. అవును అప్పుడు తాను అలా ప్రవర్తించినందుకు తర్వాత సిగ్గుపడ్డాడు కూడా.

కోడలు మళ్ళీ చెప్పడం ప్రారంభించింది.

''...నాన్న క్యాష్ ఇస్తూ, చెప్పిన మాటలు నాకు గుర్తుండిపోయాయి. 'అమ్మా, డబ్బు కరిగిపోతుంది. పొలం మిగిలిపోతుంది. ఆపదలో అదే కాపాడుతుంది' అని. నేను చాలా సంవత్సరాలు నేషనల్ సేవింగ్స్ ఖాతాలో దాచిన డబ్బు ఉపయోగించి నాన్న చేసిన అప్పు తీర్చి పొలం నాపేర్న వ్రాయించుకున్నాను. ఇప్పుడు దాని ఖరీదు లక్షలైంది. ఈ తప్పనిసరి పరిస్థితుల్లో మనం బాగుపడాలంటే.. అది అమ్మాలి. అందుకే మీకు ఆరోజు చెప్పకుండా వెళ్ళాను'' అంది.

''చాలా మంచిపని చేసావు తల్లీ. నీవు చేసిన ముందు ఆలోచనవల్ల మీ అత్తయ్య బ్రతికింది. వ్యాపారం పుంజుకుంది'' అని కోడల్ని ప్రశంశించారు రాఘవయ్య.

హాల్లో ఎదురుగా అల్లుడు కూతురు ఉన్న ఫోటో స్థానంలో కొడుకు కోడలి ఫోటో పెట్టించమని పురమాయించాడు.

ఏనాడూ, ఏదీ కోరని కోడలు ఆపదలో ఆదుకుంది. ప్రతి సంవత్సరం లక్షలు లక్షలు తీసుకు వెళ్ళే కూతురు పత్తాలేదు. ఒకప్పుడు ఇంట్లో కోడలు తిరుగాడుతున్నా, నిత్యం సరస్వతమ్మ నోటి నుండి కూతురి నామస్మరణే.

అలాంటిది ఇప్పుడు కూతురి పేరు వినబడటం లేదు. సరస్వతమ్మ నోటంట జ్యోతీ.. అనే కోడలి నామస్మరణే!

ఇల్లంతా జ్యోతిమయం! కోడలే కూతురు అయింది!

★